ఆసరాతో ఆర్థికాభ్యున్నతి

- అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపుతున్న 'ఆసరా'
- నాలుగు విడతల్లో నూజివీడు పట్టణానికి రూ.26.77 కోట్ల జమ

నూజివీడు: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏప్రిల్ 11, 2019 వరకు డ్వాక్రా సంఘాలకు బ్యాంకులలో పెండింగ్‌లో ఉన్న రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన 57 నెలల కాలంలో నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు నిధులు విడుదల చేసి మహిళలకు తోడ్పాటుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. దీంతో మహిళలు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారుల వద్ద రుణం తీసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. బ్యాంకులకు రుణాలను చెల్లించొద్దని చెప్పి 2014లో అధికారంలోకి వచ్చి రుణమాఫీ చేయకుండా టీడీపీ అధినేత చంద్రబాబు తమను నిలువునా మోసం చేశారని డ్వాక్రా సంఘాల మహిళలు గుర్తుచేసుకుంటున్నారు. ఇచ్చిన హామీని అమలు చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు కృతజ్ఞతలు చెబుతున్నారు.



చిరు వ్యాపారాలతో ఉపాధి

నూజివీడు పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు నాలుగు విడతల్లో రూ.26.77 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా విడుదల చేసింది. ఈ నిధులతో చిన్న చిన్న అవసరాలను తీర్చుకోవడం, పాడి గేదెలను కొనుగోలు చేసి పాల ఉత్పత్తి ద్వారా రోజువారీ ఆదాయం సమకూర్చుకోవడం, చిరు వ్యాపారాలు వంటివి చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. రుణమాఫీతో పాటు సున్నావడ్డీ డబ్బు లు కూడా క్రమం తప్పకుండా సమయానికి జమ చేస్తుండటంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్నకు రుణపడి ఉంటామని పేర్కొంటున్నారు.

విడత	గ్రూపులు	లబ్ధి దారుల సంఖ్య	విడుదలైన మొత్తం (రూ.కోట్లలో)
1వ విడత	653	6296	6.17
2వ విడత	662	6385	6.89
3వ విడత	662	6385	6.89
4వ విడత	663	6395	6.82

మా గ్రూపునకు రూ.5.82 లక్షల జమ



వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా గ్రూపునకు ఇప్పటి వరకు నాలుగు విడతలుగా రూ.5.82 లక్షలు వైఎస్ జగన్ ప్రభుత్వం జమచేసింది. మా గ్రూపులో ఉన్న 10 మందికి రూ.58,200 చొప్పున జమ అయింది. వీటితో కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నాం. మాట ఇచ్చి రుణ మాఫీ చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా ఉంటాం.

– నాయుడు మధులత, 11వ వార్డు, నూజివీడు

నాలుగు విడతల్లో రూ.6.70 లక్షల జమ



మాది స్వప్నలత మహిళా సంఘం, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మాకు ఒక్కొక్కరికీ నాలుగు విడతల్లో రూ.67 వేలు జమ అయింది. మా గ్రూపునకు మొత్తం రూ.6.70 లక్షలు వచ్చాయి. ఈ నగదును పిల్లల చదువులకు, కుటుంబ అవసరాలకు ఉపయోగించుకున్నాం. కొందరు చిరువ్యాపారాలు చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణమాఫీ చేయడం ఆనందంగా ఉంది.

– కె.లావణ్య, కుమ్మరిపేట, నూజివీడు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్థానిక ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం మంగళవారం ప్రారంభించారు. అనంతరం క్రాంతి హైస్కూల్‌లో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిపో సూపరింటెండెంట్ (ట్రాఫిక్) ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్, డిపో అధికారులు నాగేశ్వరరావు, ఈశ్వరరావు, అరవింద్, యూనియన్ నాయకుడు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

జిల్లా గిరిజన సంక్షేమాధికారి సునీత



మైలవరం: విద్య ద్వారానే సమాజంలో వ్యక్తులకు గుర్తింపు లభిస్తుందని ఎన్టీఆర్ జిల్లా గిరిజన సంక్షేమాధికారి జె. సునీత అన్నారు. మైలవరంలోని లీలావతి యూపీ గిరిజన పాఠశాలను వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆమె సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం స్థానిక విద్యాశాఖాధికారి-1 పీవీ నరసింహారావు పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రాజక్టు వర్కు, విద్యా విషయాలను గమనించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి జె.రాధాకుమారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



మైలవరం: మైలవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల)లో వివేకానంద పాఠశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ ఎ. కోటిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాని సాధనకు కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు పట్టుదల, కృషి ఎంతో అవసరమన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలి, టెస్ట్ తరువాత ఏ కోర్సులు తీసుకుంటే బాగుంటుందో వివరించారు. కార్యక్రమంలో లయన్స్ కృష్ణా జిల్లా కెరీర్ గైడెన్స్ కో-ఆర్డినేటర్ ఎం. సాంబశివరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, సెక్రటరీ చలవాది హరీష్‌కుమార్ గుప్తా, ట్రెజరర్ తిమ్మన దినేష్‌బాబు, లయన్స్ క్యాబినెట్ మెంబర్ పి. రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విస్సన్నపేట: మండల పరిధి నరసాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎంబీడీ శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతికి ఎస్సీ 60, బీసీసీ 10, ఎస్టీ 05, బీసీ 04, ఓసి 01, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఎస్సీ 60, బీసీసీ 10, ఎస్టీ 05, బీసీ 04, ఓసి 01 సీట్ల చొప్పున సీట్లు భర్తీ చేస్తామన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన జరుగుతుందని వివరించారు.

ప్రముఖులు, నాయకులను కలిసిన తిరుపతిరావు

వెల్వడం(మైలవరం): వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డిని మైలవరం మండలం వెల్వడంలోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆశీస్సులతో తనను మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారని తిరుపతిరావు చెప్పారు. పార్టీ విజయానికి సహకరించాలని డాక్టర్ హనిమిరెడ్డిని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట తిరుపతిరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డితో మాట్లాడుతున్న తిరుపతిరావు

- రెడ్డిగూడెం: రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డిని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు మంగళవారం కలిశారు. పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.
- జి.కొండూరు: జి.కొండూరు మండల కన్వీనర్ కాజా బ్రహ్మయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నెల్లూరి లీలాశ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు జీఎంఎస్‌వీ కృష్ణప్రసాద్, కేడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు, సర్పంచ్‌లు దేశం సుధాకర్‌రెడ్డి, నెల్లూరి శ్రీదేవిని తిరుపతిరావు మంగళవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

తిరుపతిరావును కలిసిన స్థానిక నాయకులు..

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావును వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైలవరం మండల అధ్యక్షుడు గన్నేపూడి వెంకట్రావు, తోట తిరుపతిరావు, ఖాజా బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ రాజు బాధ్యతల స్వీకారం



ఇబ్రహీంపట్నం: తహసీల్దార్‌గా బీఎస్‌వీఎస్‌ఆర్‌ఎల్ రాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా నిడమర్రు మండలం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు కాకినాడ జిల్లా రౌతులపూడి మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ బీఎస్‌వీఎస్‌ఆర్‌ఎల్ రాజుకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

సెక్టార్-1 ఎస్ఐగా సత్యనారాయణ



తిరువూరు: తిరువూరు పోలీస్‌స్టేషన్ సెక్టార్-1 ఎస్ఐగా కేవీజీవీ సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వి. సతీష్ ఎన్నికల నేపథ్యంలో బదిలీ కాగా, ఆయన స్థానంలో సత్యనారాయణ నియమితులయ్యారు. స్థానిక పోలీసు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబులు అందజేస్తున్న ఎంపీపీ నాగలక్ష్మి, జెడ్పీటీసీ గనియా

ఎ.కొండూరు: కృష్ణారావుపాలెం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం 8వ తరగతి విద్యార్థులకు ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా ట్యాబ్‌లను మంగళవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పర్వతనేని చంద్రమోహనరావు, కాలసాని చెన్నారావు, జరబల పెదబాబు, షేక్ కమిన్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జాల ముత్తు, ప్రిన్సిపాల్ వీఎస్ఆర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ



వృద్ధురాలు యశోదకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

మైలవరం: మైలవరం మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆరో రోజు మంగళవారం కొనసాగింది. మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు ఒకటో తేదీ నుంచి పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. మండలంలో మొత్తం 9,797 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. ఈ నెల 8వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.

ఎన్‌ఆర్ఐ అధ్యాపకుడికి డాక్టరేట్



ఆగిరిపల్లి: పోతవరప్పాడు ఎన్‌ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలోని బీఎస్‌హెచ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. శ్రీనివాస్ 'ప్రాపర్టీస్ ఆఫ్ లైన్ గ్రాఫ్స్ అండ్ ప్రైమ్ గ్రాఫ్స్ బేస్డ్ ఆన్ అసోసియేట్ రింగ్స్' అంశంపై పరిశోధనలు చేసినందుకు పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా శ్రీనివాసును కళాశాల చైర్మన్ వెంకట్రావు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగ భాస్కర్, డైరెక్టర్ జి.సాంబశివరావు, అడ్మిన్ డైరెక్టర్ రోశయ్య, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఎన్‌వీ సురేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు .

ఎంపీటీసీ సభ్యుడికి ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు పరామర్శ

ఆగిరిపల్లి: ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపీనాథ్ తండ్రి నాగేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. సోమవారం రాత్రి గోపీనాథ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరామర్శించారు. నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, ఎంపీటీసీ నాగుల్ మీరా, నాయకులు బోయిన శ్రీమన్నారాయణ, ఎస్‌కే సుభాని పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు: ఇద్దరికి తీవ్ర గాయాలు

జి.కొండూరు: ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. వెలగలేరు గ్రామానికి చెందిన యర్రగుంట ప్రభుదాసు, అతని భార్య నాగమణితో కలిసి జి.కొండూరుకు మంగళవారం మధ్యాహ్నం ఆటోలో బయలుదేరారు. ఆటో వెలగలేరు గ్రామంలోని గాంధీబొమ్మ సెంటర్‌కు రాగానే ఎదురుగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ విజయవాడకు చెందిన శ్రీనివాసరావుతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ నాగమణికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుదాస్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. జి.కొండూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

లయనిజమ్‌పై అవగాహన అవసరం

మైలవరం: ప్రతి ఒక్కరూ లయనిజమ్ గురించి తెలుసుకోవాలని ద్వారకా తిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు అన్నారు. మైలవరంలోని ఆయన కార్యాలయంలో ఎస్వీఆర్‌జీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజన్ సెంటర్ ఎక్విప్‌మెంట్ (కంటి చూపును పరీక్షించే పరికరాలు)ను మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విసన్నపేట వారికి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో లయన్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ ఎస్‌వీఎస్ నివృతరావు, ఎల్‌సీఐఎఫ్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ లయన్ టి.వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ సీజేడబ్ల్యూకే బాబు, మైలవరం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, సెక్రటరీ చలువాది హరీష్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలతో చేరువైన వైద్య సేవలు

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో పేదలకు వైద్య సేవలు చేరువయ్యాయని సర్పంచ్ పిల్లి సత్యనారాయణ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి, ఎంపీడీఓ పద్మావతిదేవి ఆధ్వర్యంలో మంగళవారం చింతలవల్లి పాఠశాల ప్రాంగణంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీల వైద్యులు షకీనా ఇవాంజిలిన్, అవినాష్, భవాని, ప్రత్యేక వైద్య నిపుణులు ప్రవీణ్‌కుమార్, లావణ్య 558 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఒకరిని మెరుగైన వైద్యం కోసం నూజివీడుకు రిఫర్ చేశారు. 190 మందికి కంటి పరీక్షలు చేశారు. 158 మందికి కళ్లజోళ్లు అందజేశారు. సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పేదల ఆరోగ్యం కాపాడడం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష రూపొందించారని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు..

కలగర(విస్సన్నపేట): పేదలకు తమ గ్రామంలోనే మెరుగైన వైద్యసేవలు ఉచితంగా అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని సర్పంచ్ దేశిరెడ్డి రమ అన్నారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాల వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి సర్పంచ్ మాట్లాడారు. శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. విజయకుమారి, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, ఎంసీటీసీ సభ్యురాలు వాసం పుల్లమ్మ, గ్రామ ప్రముఖుడు దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అశ్వనీదత్, పంచాయతీ కార్యదర్శి ఎస్. రామారావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం

చాట్రాయి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం చాట్రాయి మండలం బూరుగుగూడెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా నిపుణులైన వైద్యులతో అన్ని రకాల వ్యాధులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందుల కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగా కుమారి, వైద్యులు సుప్రియా చౌదరి, శ్వేత, శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాదు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



కలగరలో మందుల కిట్టు అందజేస్తున్న ఎంపీడీఓ విజయకుమారి, సర్పంచ్ రమ



బూరుగుగూడెంలో జగనన్న సురక్ష మందుల కిట్‌ను అందజేస్తున్న దేశిరెడ్డి

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలి

మైలవరం: మైలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరావును మైలవరంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం రెడ్డిగూడెం మండల నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల పార్టీ అధ్యక్షులు బలగాని తిరుపతిరావు, సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, రైతు సలహా మండలి అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు రామినేని వీరాస్వామి నాయుడు, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



తిరుపతిరావును కలిసి అభినందించిన రెడ్డిగూడెం నాయకులు

రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవాలి

నూజివీడు: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన ఆగిరిపల్లి మండలం ఈదర వాలీబాల్ జట్టు రాష్ట్ర స్థాయిలో కూడా విజేతగా నిలవాలని డీవైఈఓ ఎం. సేవియా ఆకాంక్షించారు. ఈనెల 9 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు విశాఖపట్నంలో నిర్వహించనున్న నేపథ్యంలో రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఈదర హైస్కూల్‌లో డీవైఈఓ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ, నైపుణ్యం గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వెలుగులోకి తెచ్చేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో ఆటల పోటీలను నిర్వహిస్తోందని వివరించారు. హెచ్‌ఎం శారద, పీడీ ప్రమీలారాణి, నియోజకవర్గంలోని వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



వాలీబాల్ జట్టుతో డీవైఈఓ సేవియా, వ్యాయామోపాధ్యాయులు

వృత్తి విద్యా కోర్సులపై పెరుగుతున్న ఆసక్తి



మూలపాడు(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం అమలు చేస్తున్న వృత్తి విద్యా కోర్సులు విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతున్నాయని జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం డేవిడ్ రాక్ ఫెల్లర్ అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి విద్య శిక్షణలో భాగంగా 9, 10 తరగతుల విద్యార్థులు స్థానిక నిమ్రా కళాశాలను మంగళవారం సందర్శించారు. కళాశాల ల్యాబ్‌లో ఎలక్ట్రికల్ ప్యానల్‌బోర్డు, రేడియో, టీవీ ఎలక్ట్రానిక్స్ పరికరాలపై అవగాహన కల్పించారు. ఇటువంటి అనుబంధ కోర్సులతో పాఠశాల స్థాయి నుంచి సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్ పాల్గొన్నారు.

బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు మారేష్‌కు సన్మానం

మైలవరం: బీసీల అభ్యున్నతికి ఎస్. మారేష్ విశేషంగా కృషి చేశారని మైలవరం ఏఎంసీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు అన్నారు. మైలవరంలోని పామర్తి శ్రీనివాసరావు కార్యాలయంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు ఎస్. మారేష్‌ను పామర్తి శ్రీనివాసరావు మంగళవారం శాలువతో ఘనంగా సన్మానించారు. బీసీల అభ్యున్నతికి మారేష్ చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయి పదవిని ఇచ్చారని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందించాలని, ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైలవరం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ సుంకర సత్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సుబానీ, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగదీష్, బీసీ నాయకులు సాంబయ్య, వీరాగౌడ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

మైలవరం: మైలవరంలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ప్రవాసాంధ్రులు, ట్రస్ట్ గౌరవాధ్యక్షురాలు శ్రీపద్మ అన్నారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలో మహిళల ఉపాధిని మంగళవారం ఆమె స్వయంగా పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాలలో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి తమ వంతు సహకరించడం సంతోషంగా ఉందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నపుడు మహిళలు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఓర్పుగా కష్టపడి కుటుంబాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. వెల్వడంలో ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కుట్టుమిషన్లను ఏ విధంగా ఉపయోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆశాజ్యోతి (యూఎస్ఏ), ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీఓ మంగా కుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులంతా తగిన సమాచారంతో హాజరు కావాలని ఆమె కోరారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు.

భర్తపై భార్య, కుమారుడు దాడి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వేరే మహిళతో సహజీవనం చేస్తున్న భర్తపై భార్య, కుమారుడు దాడిచేశారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం...విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన కనకం విజయలక్ష్మి తన భర్తతో మనస్పర్ధలు రావడంతో రెండేళ్ల కిందట విడిపోయి కొండపల్లి చైతన్యనగర్‌లో ఉంటోంది. ఆమె సింగ్‌నగర్‌కు చెందిన సత్యనారాయణ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి విజయలక్ష్మి ఇంటికి సత్యనారాయణ వచ్చాడు. వారు ఇంటిలో ఉండగా సత్యనారాయణ భార్య శివరామలక్ష్మి, కుమారుడు సాయి కలిసి వారిపై దాడి చేశారు. దాడిలో విజయలక్ష్మికి తీవ్ర గాయాలు, సత్యనారాయణకు స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితురాలు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.